

సాక్షి
బాపట్ల

శనివారం । 14 । అక్టోబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2953 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 527.00 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎడమకాలువకు 6,022 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దేవస్థానంలో ఏర్పాట్లు పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భక్తులకు అమ్మవారి పరిపూర్ణ దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ తెలిపారు.

న్యూస్‌రీల్

సచివాలయాల సేవలు భేష్



మేదరమెట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ పరిశీలకురాలు శిరీష అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలోగల సచివాలయాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో ఆమె మాట్లాడారు. పంచాయతీలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి, ఆర్థిక సమీకరణల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి,పొడి చెత్త నుంచి సంపదను తయారు చేస్తున్న కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఆమె వెంట సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, డీపీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓపీఆర్‌డీ ఓబులేసు, ఈఓ శ్రీనివాసరావు, స్థానిక రైతులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.46లక్షలు


దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.7,46,979 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సైదమ్మబాయి ఆధ్వర్యంలో 29 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సైదమ్మబాయి, కరలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఈఓ పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: దసరా పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన సెలవుల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని డీఈఓ పి.శైలజ శుక్రవారం ఓప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు శనివారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు సెలవులుగా పరిగణించాలని, క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు ఈనెల 21 నుంచి 24 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదని, ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో తరగతులు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

యార్డులో 23,379 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,315 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 23,379 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,200 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,216 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

జగనన్నకు చెబుదాం.. ప్రతిష్టాత్మకం

- జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా
- 174 అర్జీలు స్వీకరణ
- జగనన్న కాలనీ ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష



వేమూరులో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా

వేమూరు: పేద ప్రజలకు ప్రభుత్వం అండగా ఉందనే భరోసా కల్పిస్తూ, వారి సమస్యలను పరిష్కరించే కార్యక్రమమే జగనన్నకు చెబుదాం అని, ఈ కార్యక్రమాన్ని అధికారులంతా ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని బాపట్ల జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా పేర్కొన్నారు. జగనన్న చెబుదాం స్పందన కార్యక్రమం వేమూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాల పెద్ద ఎత్తున హాజరైన ప్రజల నుంచి కలెక్టర్ వినతి పత్రాలను స్వీకరించారు. కొన్ని సమస్యలు అక్కడికక్కడే పరిష్కరించారు. కొన్ని సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలు పరిష్కారానికి అధికారులందరు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రంజిత్ బాషా చెప్పారు. బాధితులకు న్యాయం చేయడమే ప్రభుత్వం ఉద్దేశం అన్నారు. ప్రజల సమస్యలను గుర్తించి క్షేత్రస్థాయిలో పరిష్కరించడానికి ప్రతి మండల కేంద్రంలో జగనన్న చెబుదాం కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రజల నుంచి వచ్చే అన్ని అర్జీలకు న్యాయబద్ధంగా పరిష్కారం చూపుతామన్నారు. ప్రజలకు మేలు జరిగేలా అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో 174 అర్జీలు అందాయి. వాటిలో 20 అర్జీలు పునరావృతం కావడంపై ఆరా తీశారు.

ఇళ్ల నిర్మాణ జాప్యంపై ఆగ్రహం..

జగనన్న కాలనీలో పక్కా గృహ నిర్మాణాలు వేగవంతంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన తెలిపారు. వేమూరు మండలంలో 32 లేవుట్‌లు ఉండగా, 2,808 ఇళ్ల మంజూరు చేయడం జరిగిందన్నారు. కాలనీల అభివృద్ధికి 14 కల్వర్టులు, 16 కాలనీలకు స్వాగత ముఖద్వారాలు, పీఆర్ ఇంజినీరింగ్ పనులు మరో 19 మంజూరు కాగా వాటిలో పురోగతి లేకపోవడంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అంతర్గత రహదారుల నిర్మాణ జాప్యంపై ఆరా తీశారు. 486 గృహాలు పునాది స్థాయిలో ఉండడం ఏమిటని ఆగ్రహం వ్యక్తం చేశారు. 1150 గృహాల నిర్మాణ పనులు మొదలు కాకపోవడంపై అధికారులను ప్రశ్నించారు. ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకు రాకపోతే హామీ పత్రం తీసుకొని అర్హులైన వారికి పంపిణీ చేయాలని సూచించారు. జిల్లా జాయింట్ కలెక్టరు శ్రీధర్, నియోజక వర్గం ప్రత్యేకాధికారి బొంతా అర్జునరావు, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ప్రత్యేకాధికారులు పాల్గొన్నారు.

వైద్యసేవల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



వేమూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టరు రంజిత్ బాషా

వేమూరు: రోగులకు వైద్య సేవల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వైద్యులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని బాపట్ల జిల్లా కలెక్టరు పి.రంజిత్ బాషా హెచ్చరించారు. మండల కేంద్రమైన వేమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. రోగులకు వద్దకు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. ప్రభుత్వం వైద్యశాలల్లో సిబ్బంది కొరత లేకుండా ఉద్యోగాలు భర్తీ చేయడం జరిగిందన్నారు. మందులు పూర్తిస్థాయిలో అందించడం జరుగుందని ఆయన తెలిపారు. వైద్య సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, నిర్లక్ష్య ధోరణిని సహించమన్నారు. ఆపరేషన్లు, రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నూతనంగా నిర్మిస్తున్న ఆస్పత్రిని పరిశీలించారు. నూతన భవనంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో వెంటనే విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి 15 రోజుల్లో విద్యుత్ సప్లయి ఇవ్వాలని సూచించారు. మళ్లీ 15 రోజుల తర్వాత ఆస్పత్రిని తనిఖీ చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ హరిణి, డాక్టర్ ప్రియదర్శిని, శ్రీనివాసరావు, రవళి, అనిల్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల్లోనూ భూ రీసర్వే

మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ సీడీఎంఏ కోటేశ్వరరావు



భూ సర్వేపై సూచనలందిస్తున్న మున్సిపల్ సీడీఎంఏ కోటేశ్వరరావు, కరణం వెంకటేష్

చీరాల: మున్సిపాలిటీ పరిధిలోని గ్రామ కంఠాల్లో ఉండే వారికి శాశ్వతంగా భూ హక్కుతో పాటు భూమికి రక్షణ కల్పించేందుకే ప్రభుత్వం జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పథకాన్ని ప్రవేశపెట్టిందని ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ సీడీఎంఏ పులిపాటి కోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం చీరాల మున్సిపాలిటీలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అధ్యక్షతన మున్సిపల్ అధికారులు, సచివాలయాల సర్వేయర్లు, ఉద్యోగులు మున్సిపల్ సర్వేయర్లతో పట్టణంలోని భూ సర్వేపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ పట్టణ ప్రాంతాల్లో భూ హక్కు- భూ రక్షను అక్టోబర్ నెలాఖరుకల్లా పూర్తిచేసేందుకు అన్నిచర్యలు చేపట్టామన్నారు. డ్రోన్ల ద్వారా చేసిన సర్వే ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయడంతో పాటుగా సచివాలయ ఉద్యోగులు, సర్వేయర్లతో ఇంటి కొలతలు తీసి శాశ్వత నివాసం ఉంటున్న వారికి భూ హక్కులు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమానికి పైలట్ ప్రాజెక్టులుగా రేపల్లె, తాడేపల్లిగూడెం మున్సిపాలిటీలను ఎంపికచేసి సర్వే పూర్తి చేశామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా 137 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, మున్సిపల్, నగర కార్పొరేషన్లలో భూ రీసర్వే చేస్తున్నామని చెప్పారు. ఇప్పటివరకు గ్రామాల్లో జరిగిన భూ రీసర్వే, భూ శాశ్వత హక్కు-రక్ష కార్యక్రమం ఇప్పుడు పట్టణ ప్రాంతాల్లోనూ చేస్తున్నామన్నారు. పట్టణంలోని చాలా ప్రాంతాలు దశాబ్దాలుగా గ్రామ కంఠాలుగానే ఉన్నాయని, దీని వలన అత్యవసర పరిస్థితుల్లో భూ యాజమానులకు సరైన భూహక్కు పత్రాలు లేక కొన్ని ఇబ్బందుల పడుతున్నారన్నారు. ఈ ఇబ్బందుల నుంచి శాశ్వత పరిష్కారం కోసం చేస్తున్న సర్వేకు అందరు సహకరించి భూ హక్కు పత్రాలు పొందాలన్నారు. వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూ రక్ష రీసర్వే మున్సిపాలిటీ, పట్టణ ప్రాంత వాసులకు చాలా మేలు చేస్తుందన్నారు. తాతల కాలం నుంచి నివాస స్థలాల్లో ఉంటున్నా, హక్కులు లేక చాలా ఇబ్బందులు పడ్డారని, దీనికి ఈ రీ సర్వే చెక్ పెడుతుందన్నారు. పట్టణ ప్రజలు సహకరించి, శాశ్వత హక్కు పత్రాలు పొందాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, ఏఓ ఉమా పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా

- ఎమ్మెల్సీ పోతుల సునీత
- జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం పరిశీలన




వైద్య శిబిరంలో ఓపీ విభాగాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

వేటపాలెం: పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు ఎమ్మెల్సీ పోతుల సునీత పేర్కొన్నారు. అక్కాయిపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఎమ్మెల్సీ సందర్శించారు. వైద్య శిబిరానికి వచ్చిన రోగులకు అందుతున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం పల్లెల్లో వైద్య విప్లవం తెస్తుందన్నారన్నారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రూతమ్మ, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొడ్డు సుబ్బారావు, జేసీఎస్ మండల ఇన్‌చార్జి లేళ్ల శ్రీధర్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పులి వెంకటేశ్వర్లు, జంగిలి రామారావు, దొన్నెంపూడి తిమోతి, బుర్ల సుబ్బరావమ్మ, బుజ్జమ్మ, కర్ర వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అదిగో.. అల్లదిగో.. ఇంద్రగిరి

- దసరా మహోత్సవాలకు ముస్తాబైన ఇంద్రకీలాద్రి
- రేపటి నుంచి తొమ్మిదిరోజుల పాటు నిర్వహణ
- ఆదివారం ఉదయం 9 గంటల నుంచి భక్తుల దర్శనానికి అవకాశం
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



ఆలయంలో భక్తుల సందడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అదిగో.. అల్లదిగో... ఆది దంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారిని పది విశేష అలంకారాల్లో దర్శించుకునే భాగ్యం భక్తులకు కలగనుంది. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకారాలు జరిగే ఆలయం విజయవాడ దుర్గగుడి మాత్రమే కావడం విశేషం. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఇంద్రకీలాద్రిని అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో పాటు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టీకే రాణా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీ ఎంత ఉన్నా గంట నుంచి గంటన్నర లోపే అమ్మవారి దర్శనం కలిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఒకసారి క్యూలైన్‌లోకి ప్రవేశించిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఉచిత అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసిన తర్వాతే బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఆదివారం ఉదయం 9 గంటల తర్వాతే దర్శనం....

ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల్లో తొలి రోజున తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరిస్తారు. ఉదయం 9 గంటల తర్వాతే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ప్రతి రోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు కొనసాగుతుంది. 20వ తేదీ మూలా నక్షత్రం రోజున మాత్రం తెల్లవారుజామున రెండు గంటల నుంచే అమ్మవారి దర్శన భాగ్యం కలుగుతుంది.

దసరా ప్రత్యేక ఆర్జిత సేవలివే...

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేకంగా ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారి ఖడ్గమాలార్చన ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి ఆరు గంటల వరకు నిర్వహిస్తారు. మహా మండపం ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద ఖడ్గమాలార్చన చేస్తారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఖడ్గమాలార్చనను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కుంకుమార్చన రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఒక బ్యాచ్ మాత్రమే జరుగుతుంది. ఇక ఉత్సవాల్లో మిగిలిన 8 రోజులు రెండు బ్యాచ్‌లను అనుమతిస్తారు. ఉదయం 7 గంటలకు, 10 గంటలకు మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహిస్తారు. ప్రత్యేక శ్రీచక్రనవార్చన మల్లికార్జున మహా మండపం రాజగోపుర ప్రాకారంలో చేస్తారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ సేవ ఉంటుంది. ప్రత్యేక చండీ హోమం 15వ తేదీ ఉదయం 10 గంటలకు, 16వ తేదీ నుంచి ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు ప్రారంభమతుంది.

ప్రతిరోజూ నగరోత్సవ సేవ....

దసరా ఉత్సవాల్లో ప్రత్యేకంగా నగరోత్సవ సేవను మరింత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వ తేదీ నుంచి సాయంత్రం 6 గంటలకు మహా మండపం నుంచి ప్రారంభమయ్యే నగరోత్సవ సేవలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తారు. మహా మండపం, గోశాల, కనకదుర్గ నగర్, దుర్గాఘాట్, దేవస్థాన ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. రాజగోపురం ఎదుట పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఊరేగింపు పూర్తవుతుంది.





దసరా సరదా.. ఇంటికి పద పదా..

దసరా పండుగ సందర్భంగా అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు ప్రభుత్వం శనివారం నుంచి సెలవులు ప్రకటించడంతో విద్యార్థులు హుషారుగా ఇళ్ల బాట పట్టారు. పదిరోజులు సెలవులు రావడంతో వివిధ పాఠశాలల్లో చదువుకుంటూ, హాస్టళ్లలో ఉంటున్నవారు సొంతూళ్లకు పయనమయ్యారు. శుక్రవారం సాయంత్రం గుంటూరు బస్‌స్టేషన్‌లో కనిపించిన దృశ్యాలివి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, గుంటూరు





నేడు, రేపు ఎస్‌ఐ అభ్యర్థులకు రాత పరీక్షలు

- గుంటూరు రేంజ్‌లో 7,145 మంది అభ్యర్థులు
- పురుషులు 6,384, మహిళలు 761
- జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు



పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో శనివారం, ఆదివారాలలో ఎస్‌ఐ మెయిన్స్ రాత పరీక్షలు జరగనున్నాయి. 7,145 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, అందులో పురుష అభ్యర్థులు 6,384, మహిళా అభ్యర్థులు 761 మంది ఉన్నారు. ఇక జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ అభ్యర్థుల ఎంపిక నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ తెలిపారు. ఈ మేరకు శని, ఆదివారాల్లో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద చేపట్టాల్సిన పోలీస్ బందోబస్తుపై శుక్రవారం గుంటూరు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

ఏసీ కళాశాల, టీజేపీసీ కళాశాల, ఆర్‌వీఆర్ జేసీ కళాశాల, వీవీఐటీ, కిట్స్, విజ్ఞాన్ నిరుల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ కళాశాల, కైట్ కళాశాల

దళారుల మాటలు నమ్మవద్దు..

ఎస్‌ఐ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మోసపూరిత మాటలను నమ్మవద్దని అభ్యర్థులను ఏఎస్పీ కోరారు. ఏ ఒక్కరికీ డబ్బులిచ్చి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు నాచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), మహేష్ (బాపట్ల జిల్లా), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ), మహబూబ్ బాషా (దక్షిణ), బాలసుందరరావు (ట్రాఫిక్), కేసీహెచ్ రామారావు (దిశా పీఎస్), ప్రకాష్ బాబు (క్రైం), చంద్రశేఖర్‌రావు (ఏఆర్), ఎస్‌బీ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి రోజా నేడు రాక



బాపట్ల: రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి ఆర్.కె.రోజా బాపట్ల మండలం కొండభొట్లువారిపాలెం శనివారం రానున్నారని శాసనమండలి చీఫ్‌విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు తెలిపారు. గ్రామంలోని దేవాలయాల వద్ద శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. మంత్రి రోజా ఉదయం 10గంటలకు దేవాలయాల వద్దకు చేరుకుంటారని తెలిపారు. దేవాలయాల పూజలకు అవసరమైన పువ్వులు కోసం 12 సెంట్లు స్థలంలో ఏర్పాటు చేసిన తోటలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఉమ్మారెడ్డితో పాటు విన్నకోట వాసు, శ్రీరామమూర్తి, శ్రీనివాసరావు, సుబ్బారెడ్డి ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థినుల ఎంపిక



చీరాల రూరల్: రాష్ట్రస్థాయి ఆటల పోటీలకు చీరాల ఈపురుపాలెం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థినులు ఎంపికయ్యారు. ఇటీవల స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లాస్థాయిలో ప్రకాశం జిల్లా సంతనూతలపాడులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో అండర్–14 విభాగంలో కె.మానస, వివేదితలు పోటీలకు ఎంపికయ్యారు. అలానే అండర్–17 విభాగంలో జి.ప్రసన్న, కె.దుర్గా భవానీలు ఎంపికయ్యారు. అండర్–14 చెస్ పోటీల్లో ఎం.తేజశ్రీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. పోటీలకు ఎంపికయిన విద్యార్థిలను శుక్రవారం హెచ్‌ఎం కె.హనోరా, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎస్.రోజ్‌హెల్మాలు అభినందించారు. విద్యార్థులు పోటీల్లో ప్రతిభ కనబరిచేందుకు శిక్షణ ఇచ్చిన పీఈటీని ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

కేసుల ఛేదనలో జాగిలాల పాత్ర కీలకం

జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

బాపట్లటౌన్: కేసుల ఛేదనలో పోలీస్ జాగిలాల పాత్ర కీలకమని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ పేర్కొన్నారు. మంగళగిరి పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఎనిమిది నెలలుగా శిక్షణ పూర్తి చేసుకొని శుక్రవారం జిల్లాకు రెండు నూతన పోలీస్ జాగిలాలు వచ్చాయి. ట్రాకర్ విభాగంలో బాపట్ల జిల్లాకు చెందిన పోలీస్ జాగిలం 'షాడో' మెడల్ సాధించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ ఇంటలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ మంగళగిరి సిటీసీలో 8 నెలల పాటు నిర్వహించిన 21వ బ్యాచ్ కెనైన్ శిక్షణ పూర్తిచేసుకొని రెండు జాగిలాలు వచ్చాయన్నారు. తొలుత మిడ్ టర్మ్ పరీక్షలో ట్రాకర్ విభాగంలో మెడల్ సాధించిన 'షాడో' జాగిలానికి మెడల్ వేసి హ్యాండ్లర్ ఏఆర్ పీసీ జీవీఎస్ నాగకుమార్‌కు బహుమతి అందించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ కేసుల ఛేదనలో, నేరస్తులను, పేలుడు పదార్థాలను గుర్తించడంలో జాగిలాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. గతంలో జిల్లాలో 4 శిక్షణ పొందిన పోలీస్ జాగిలాలు ఉన్నాయన్నారు. ప్రస్తుతం వాటి సంఖ్య 6కు చేరిందని చెప్పారు. వీటి చేరికతో డాగ్ స్క్వాడ్ బృందం మరింత బలోపేతం అయిందన్నారు. లాబ్రాడర్ రిట్రీవర్ జాతికి చెందిన బిట్టు జాగిలం ఎక్స్‌ప్లోజివ్ విభాగంలో శిక్షణ పొందిందని, బెల్జియం మలనాయిస్ జాతికి చెందిన షాడో జాగిలం ట్రాకింగ్ విభాగంలో శిక్షణ పొందినట్లు వివరించారు. కార్యక్రమంలో ఎస్బీ సీఐ వి.సూర్యనారాయణ, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్ నాయక్ పాల్గొన్నారు.



జిల్లాకు నూతనంగా వచ్చిన పోలీస్ జాగిలాలను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

ఎన్జీరంగా వర్సిటీకి రీసెర్చ్ టూర్ ప్రతినిధులు

గుంటూరు రూరల్: భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, స్ప్రింగర్ నేచర్ భారత పరిశోధన పర్యటనలో భాగంగా ఇండియన్ రీసెర్చ్ టూర్ ప్రతినిధుల బృందం శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. లాం లోని వ్యవసాయ పరిశోధన భవనంలో వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్ప్రింగ్ నేచర్ ఇండియా, ఇండియా ఎడ్యుకేషన్ మినిస్ట్రీ సంయుక్తంగా జీ–20 కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 26న భువనేశ్వర్‌లో సమావేశమై ఇండియన్ రీసెర్చ్ టూర్ బస్సు ద్వారా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అక్కడి నుంచి సెప్టెంబర్ 28న ఢిల్లీ యూనివర్సిటీలో మొదలుపెట్టి బిట్స్ పిలాని, ఎన్ఐటీ జైపూర్, డెల్, ఆగ్రా ఐఐఎస్‌సీ నాగపూర్, హైదరాబాద్ యూనివర్సిటీ, ఐఐఎస్ఈఆర్ బెంగళూరు, వీఐటీ వేలూరు, ఐఐటీ చెన్నైలలో ఇప్పటికే పరిశీలన పూర్తయిందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఎన్జీరంగా వర్సిటీ పర్యటనకు వచ్చినట్లు వివరించారు. ఈ పరిశోధన టూర్ ద్వారా పరిశోధన సహకారం, రాష్ట్ర జాతీయ ప్రభుత్వాల పార్టనర్ షిప్‌లు పెంపొందించటం, పబ్లికేషన్స్ ద్వారా పరిశోధన అంశాలు పబ్లిష్ చేయటం సైంటిఫిక్ కమ్యూనిటీలో సమన్వయం అభివృద్ధి చేయటం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మకమైన పరిశోధన పర్యటనలో దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన 15 సంస్థల్లో ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒకటని వివరించారు. ప్రతినిధుల బృందానికి విశ్వవిద్యాలయం అభివృద్ధి, కార్యాచరణపై వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయం అకడమిక్ రిసోర్సెస్, లైబ్రరీ రిసోర్స్‌లో డిజిటల్ ఇన్నోవేషన్‌లు, పరిశోధన ఫలితాలను డాక్టర్ ఎ.మణి వివరించారు. స్ప్రింగర్ నేచర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేష్ సర్వసిద్ధి టూర్ ఉద్దేశాన్ని వివరించారు.



వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మిదేవి శాస్త్రవేత్తలతో పరిశోధన టూర్ బృందం

భారతదేశంలో పరిశోధన దృక్పథాన్ని బలోపేతం చేసేందుకు ఈ పరిశోధన టూర్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వీసీ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, అగ్రి ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, డాక్టర్ పి.వాసంతి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.సీతారామలక్ష్మి బృందం ఆమె పరిశోధన మా భవిష్యత్ అనే విషయంపై బృంద చర్చల్లో భాగంగా రీసెర్చ్ ఇన్నోవేషన్ డెసిమినేషన్, ఓపెన్ ఆక్సిస్ అనే విషయాలను చర్చించారు. కార్యక్రమంలో భాగంగా పరిశోధన టూర్ ప్రతినిధుల బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.

పురందేశ్వరి వైఖరిలో స్పష్టతలేదు

మండలిలో చీఫ్‌విప్ డాక్టరు ఉమ్మారెడ్డి

బాపట్ల: బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి వైఖరిలో స్పష్టతలేదని శాసనమండలి చీఫ్ విప్ డాక్టరు ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. బాపట్ల మండలం కొండభొట్లువారిపాలెంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టరు ఉమ్మారెడ్డి మాట్లాడారు. చంద్రబాబునాయుడు అరెస్టు విషయంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఎటువంటి స్టాండ్ తీసుకోకపోగా కనీసం కేంద్ర నాయకత్వం ఒక ప్రకటన కూడా ఇవ్వలేదన్నారు. ఆ పార్టీ నుంచి రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న పురందేశ్వరి, లోకేష్‌ను పార్టీ కేంద్ర నాయకత్వం వద్దకు తీసుకుపోవటంలో అర్థం ఏమిటో చెప్పాలన్నారు. చంద్రబాబునాయుడు చేసిన తప్పులకు జైలుకు వెళ్లితే దానిని అధికార పార్టీ కావాలనే చేసిందనే వాదన సరికాదన్నారు. చంద్రబాబునాయుడు జైలులో బరువు తగ్గారని చెప్పే నాయకులు ఆయన ఒక కేజీ పెరిగారంటూ జైలు అధికారులు విడుదల చేసిన బులిటెన్ చూడాలని హితవు పలికారు.

18 నుంచి రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలు

చెరుకుపల్లి: రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలు ఈనెల 18వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా సర్పంచు ఫోరం సంఘ అధ్యక్షుడు చీరాల ప్రసాద్ రెడ్డి శుక్రవారం తెలిపారు. మండలంలోని రాంబొట్లపాలెం పంచాయతీ పిట్టు కోటిరెడ్డి పాలెంలోని రాజరాజేశ్వరి దేవి ఆలయ ప్రాంగణంలో దేవి శరన్నవరాత్రుల సందర్భంగా చీరాల సాంబిరెడ్డి మెమోరియల్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రా ఓరుగంటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు ఆశీస్సులతో పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోటీలలో విజేతలకు మొదటి బహుమతి రూ.15 వేలు, రెండో బహుమతి రూ.10 వేలు, మూడో బహుమతి రూ.7 వేలు, నాలుగో బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు వివరించారు. వివరాలకు 7396324751, 6304615970 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తోట



శివనాగేశ్వరరావు

పర్చూరు(కారంచేడు): కాంగ్రెస్ పార్టీ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్చూరుకు చెందిన తోట శివనాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి ఉత్తర్వులు అందినట్లు శివనాగేశ్వరావు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకంను వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ విజయానికి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

మత్తు పదార్థాల కేసులో నిందితుడు అరెస్టు

మార్టూరు: మత్తు పదార్థాల అక్రమ రవాణా కేసుకు సంబంధించిన మరో నిందితుడిని మార్టూరు సీఐ ఎస్‌కే టీ ఫిరోజ్ శుక్రవారం అరెస్టు చేశారు. పోలీసుల వివరాల మేరకు.. గత ఏడాది డిసెంబర్ 7వ తేదీ బెంగుళూరు నుంచి విజయవాడకు మత్తు పదార్థాలను అక్రమంగా తరలిస్తున్న పఠాన్ జమీల్‌ఖాన్, ఆరీఫ్‌లను బొల్లాపల్లి టోల్‌ప్లాజా వద్ద మార్టూరు పోలీసులు అరెస్ట్ చేశారు. విచారణలో వారిచ్చిన సమాచారం మేరకు మూడో నిందితుడైన మోటూరి సందీప్‌ను గత సోమవారం యద్దనపూడి ఎస్సై నాగశ్రీను ఏలూరు జిల్లా చింతలపూడిలో అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో నాలుగో నిందితుడిగా ఉన్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగి షేక్ సాహుల్‌ను సీఐ ఆదేశాల మేరకు యద్దనపూడి ఎస్ఐ నాగశ్రీను బృందం గురువారం రాత్రి బెంగళూరులో అరెస్టు చేసి మార్టూరుకు తరలించారు. శుక్రవారం సాయంత్రం సాహుల్‌ను అద్దంకి కోర్టుకు తరలించినట్లు సీఐ ఫిరోజ్ తెలిపారు.

వేద ప్లాటినం హైబ్రిడ్ పత్తి విత్తనంతో అధిక దిగుబడి

88 త్యాళ్లూరు(క్రోసూరు): వేద ప్లాటినం హైబ్రిడ్ ప్రత్తి విత్తనంతో అధికదిగుబడి పొందవచ్చునని కంపెనీ డీజీఎం దావులూరి నాగబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని 88 త్యాళ్లూరు గ్రామంలో పత్తి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. కంపెనీ డీజీఎం మాట్లాడుతూ వేద ప్లాటినం పత్తి విత్తనం రకం అన్ని రకాల నేలలకు అనువైనదని చెప్పారు. గులాబీ పురుగు, దోమపోటు, ఇతర తెగుళ్లను సమర్థవంతంగా ఎదుర్కొంటుందన్నారు. అధిక దిగుబడి ఇస్తుందని, పత్తి తీసేందుకు సులువైన విత్తనమని వివరించారు. ప్రతి చెట్టుకు 80 నుంచి 100 కాయలను కలిగి ఉంటుందన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందించవచ్చు

- రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ ప్రారంభం
- పాల్గొన్న నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్
- మూడు రోజులపాటు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెంకటేష్

చీరాల రూరల్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని.. ప్రతి ఒక్కరూ చదువుతో పాటు క్రీడలలో రాణించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కరణం వెంకటేష్ అన్నారు. స్థానిక ఎస్ఆర్అండ్‌పీఎం ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో శుక్రవారం రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈపోటీలకు ముఖ్య అతిథిగా కరణం వెంకటేష్ పాల్గొని మాట్లాడారు. క్రీడల వలన యువకులు చెడుదారి వీడి మంచి ప్రవర్తన వైపు మళ్లే అవకాశం ఉంటుందన్నారు. క్రీడల్లో రాణించిన ఎంతోమంది క్రీడాకారులు స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారని చెప్పారు. ఆసియా పోటీల్లో గతంలో కంటే మన దేశం వంద పతకాలకుపైగా గెలుచుకుందంటే క్రీడలపై యువత మక్కువ పెంచుకోవడమే కారణమన్నారు. విద్యార్థి దశ నుంచి క్రీడలపై మక్కువ పెంచుకున్నట్లయితే కాలేజి స్థాయికి వెళ్లేసరికి మంచి క్రీడాకారులుగా మనగలుగుతారని చెప్పారు. పోటీల నిర్వాహకులు గొట్టిపాటి భాగ్యరాజు, కంకణాల టామ్‌నిస్సీలు మాట్లాడుతూ 3 రోజులు పాటు ఫ్లడ్‌లైట్ల వెలుగుల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో గెలుపొందిన క్రీడా జట్లకు మొదటి బహుమతిగా రూ.50,000, రెండో బహుమతిగా రూ.30,000, మూడో బహుమతిగా రూ.20,000 అందించనున్నట్లు చెప్పారు. పోటీల్లో పాల్గొనేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి 12 క్రీడా జట్లు పాల్గొనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు, అగాపే ఆస్పత్రి ఎండీ డాక్టర్ సిల్వస్‌రాజు, కౌన్సిలర్లు గొట్టిపాటి ఎబినేజర్, యాతం మేరిబాబు, కోడూరి ప్రసాద్‌రెడ్డి, డొక్కా ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో సాయం మరువలేనిది

ఆర్డీఓ రవీందర్

బాపట్ల: విపత్తుల సమయంలో సహాయం ఎంతో గొప్పవిషయమని ఆర్డీఓ రవీందర్ పేర్కొన్నారు. ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో విపత్తుల సమయంలో సహాయ, సహకారాలు అందించిన వారిని శుక్రవారం సన్మానించారు. ఆర్డీఓ మాట్లాడుతూ విపత్తుల సమయంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సేవా కార్యక్రమాలు చేస్తుందని తెలిపారు. కరోనా సమయంలో ఎంతో ప్రేమాభిమానాలతో వారికి సహాయం అందించారని చెప్పారు. అంతర్జాతీయ విపత్తు అదుపు దినోత్సవం సందర్భంగా విపత్తులో సాయం అందించిన వారిని సేవ శౌర్యజ్ఞాపికను అందించి సన్మానించారు. రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు ఆధ్వర్యంలో సేవలు అందించిన జె.వి.కృష్ణారావు, జాన్‌వెస్లీ, అడే బుజ్జి, సత్యనారాయణరాజు, ఎండీ సాదిక్, బాబునాగేంద్రం, సంగాని ఏడుకొండలు, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, శ్రీ రామచంద్రమూర్తి, డి.వి రమణబాబు, పానకాల రాయుడు, మామిడి రాజశేఖర్, కత్తి శ్రీనివాస్‌రావులకు సేవా అవార్డులు అందించారు.



విపత్తుల్లో సహాయ సహకారాలు అందించిన వారిని అభినందిస్తున్న ఆర్డీఓ గంధం రవీందర్

ఆటో బోల్తా.. మహిళ మృతి

డ్రైవర్‌తో పాటు పాపకు గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన అనూరాధ

పర్చూరు(కారంచేడు): ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మరో ఇద్దరు గాయపడ్డారు. ఏఎస్ఐ కోటేశ్వరరావు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన ఏడుగురు ఆటోలో చీరాల అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజల కోసం బయలుదేరారు. ఈ క్రమంలో వాడరేవు– పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు– పర్చూరు గ్రామాల మధ్యన ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు సమీపం ప్రమాదం చోటుచేసుకుంది. అదుపు తప్పి ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న అనూరాధ(35)కు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. గాయపడిన చిన్నారి వర్షను, పాలపర్తి రామాంజనేయులు, ఉయ్యాల రామాంజనేయులను 108 ద్వారా చీరాల ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని కూడా చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మిగిలిన నలుగురు ఇంటికి వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గతంలోను ఇదే ప్రదేశంలో ఒక బాలుడు ప్రమాదంలో మృతి చెందాడని, రోడ్డుకు మరమ్మతులు చేయించమని ఎన్నిసార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

శభాష్ గోవర్ధన్

అత్తోట విద్యార్థికి ఎమ్మెల్యే శివకుమార్ అభినందన



గోవర్ధన నాయుడిని పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

అత్తోట(కొల్లిపర): న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్ లో ఈనెల 9, 10, 11 తేదీల్లో కేంద్ర శాస్త్ర, సాంకేతిక విభాగ ఆధ్వర్యంలో 10 జాతీయస్థాయి ఇన్‌స్పైర్ మనక్ విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో గుంటూరు జిల్లా నుంచి కొల్లిపర మండల పరిధిలో అత్తోట గ్రామానికి చెందిన విద్యార్థి అద్దంకి గోవర్ధన నాయుడు అర్హత సాధించాడు. దీంతో శుక్రవారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ స్థానిక పార్టీ నాయకులతో కలసి గోవర్ధన నాయుడు ఇంటి వద్ద కలసి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యారంగంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు కారణంగా నేడు విద్యార్థులలో చదువుపై ఆసక్తి కలిగి శాంకేతికను అందిపుచ్చుకొని నూతన శాంకేతకతను రూపొందించటం జరుగుతుందన్నారు. తొలుత గోవర్ధన నాయుడు రవాణా సదుపాయం లేని మారుమూల గిరిజన, కొండ ప్రాంతాల నుంచి రోగుల్ని, గర్భిణులను తరలించేందుకు వీలుగా రూపొందించిన బై సైకిల్ అంబులెన్స్‌ను పరిశీలించి, దాని పనితీరును అడిగి తెలుసుకున్నారు. గోవర్ధన నాయుడు 2022–23లో అత్తోటగ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో 10వ తరగతి పూర్తి చేసుకొన్ని ప్రస్తుతం నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఇంటర్ చదువుకుంటున్నాడు. గోవర్ధన నాయుడు మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పోటీపడిన 600 మందిలో ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపికైన నలుగురిలో తాను ఒకరిగా ఉండటం ఎంతో ఆనందంగా ఉందని వ్యక్తం చేశాడు.తాను జాతీయస్థాయి నుంచి త్వరలో జపాన్‌లో జరిగే సైన్స్ ప్రదర్శనలో పాల్గొనే అవకాశం ఉందని తెలిపాడు. గోవర్ధన నాయుడు తల్లిదండ్రులు తమ పిల్లవాడు ఇంతస్థాయి సాధించటం ఎంతో ఆనందంగా ఉందని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నాగపుణేశ్వరరావు, ఎంపీటీసీ బొల్లిముంత పోతురాజు పాల్గొన్నారు.



సైకిల్ అంబులెన్స్

పెదకాకానిలో శాస్త్రోక్తంగా పవిత్రోత్సవాలు

కుంభాభిషేకం, పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు

పెదకాకాని: శివాలయంలో మూడు రోజుల పవిత్రోత్సవములు శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద శివాచార్య వారి ప్రధానాచార్యత్వమున ఆలయ స్థానాచార్యులు పాతూరు సాంబశివరావు, ప్రధాన అర్చక స్వామి లక్ష్మీనారాయణ వరప్రసాద్‌ల పర్యవేక్షణలో చతుర్వేదపారాయణ, నిత్య పూజావిధులు, అష్టోతర శతకాలఅభిషేకం, స్వామివార్లకు అలంకరణ, పవిత్రముల సమర్పణ, సుముహూర్తము ఉదయం 10:59 గంటలకు స్వామివార్లకు దంతకాష్ట, భస్మరక్షణాదుల ప్రదర్శన, కుంభాభిషేకం, పూర్ణాహుతి, అవబృధస్నానము ఆచార్యాది ఋత్విక సన్మానం, పవిత్రములతో ఆశీర్వచనం, తీర్థ ప్రసాద వినియోగముతో పవిత్రోత్సవాలు ముగిశాయి. తెనాలి పట్టణానికి చెందిన నేలవెల్లి కోటేశ్వరి కుటుంబసభ్యుల ద్రవ్య సహకారంతో ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర రెడ్డి, పాలకవర్గం సభ్యులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పవిత్రోత్సవ క్రతువు అనంతరం భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. సాయంత్రం 5 గంటలకు భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మిద్దె వాహనంపై అలంకరించి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.



ఆలయంలో స్వామి వారికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

వేకువజామున రాహు కేతు గ్రహ పూజలు

శివాలయంలో శనివారం మహాలయ అమావాస్య పురస్కరించుకుని వేకువ జామున 5 గంటల నుంచే రాహు కేతు గ్రహ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమిషనర్ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పవిత్రోత్సవాలు ముగియడంతో ఆలయంలోని అన్ని రకాల ఆర్జితసేవలు భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏసీ తెలియజేశారు.